తల్లి పాలు బిడ్డకు అమృతం



తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ

మైలార్‌దేవ్‌పల్లి: తల్లిపాలు బిడ్డలకు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ, మెడికల్ ఆఫీసర్ వందన పేర్కొన్నారు.శుక్రవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్, బాబుల్‌రెడ్డినగర్ అంగన్ వాడీ కేంద్రంలో టీచర్ అనిత ఆధ్వర్యంలో తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..తల్లి పాలతో బిడ్డకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. బిడ్డ పుట్టిన గంటలోపే తల్లి పాలు పట్టించాలని సూచించారు. చాల మంది తల్లులు పాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తుండటంతో చిన్నారులు రక్తహీనత తదితర వ్యాధులకు గురవుతున్నారన్నారు. తల్లి పాలపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 7 వరకు వైద్య,ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో తల్లి పాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్ వాడీ టీచర్ అనిత,కమ్యూనిటి ఆర్గనైజర్ గౌరి, ఏఎన్ఎం ప్రేమాదేవి, భాగ్య, ఆశవర్కర్లు మంగ, సరిత , రేణుక తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



హౌసింగ్ బోర్డు కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన డివిజన్ పరిధిలోని దుర్గానగర్ ,హౌసింగ్ బోర్డు కాలనీ,టీఎన్‌జీవోస్ కాలనీల్లో జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా సీసీ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ పైపులైన్, వీధి దీపాలు తదితర సమస్యలను స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు.అనంతరం ఆయన మాట్లాడుతూ..సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టడానికి కౌన్సిల్‌లో చర్చించి నిధులను మంజూరు చేయిస్తానన్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువస్తున్న అన్ని సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు రాహుల్,భాను,హరీష్ ,జలమండలి మేనేజర్ సాదిక్, వర్క్ఇన్‌స్పెక్టర్ జియా, వినయకుమార్ , స్థానికులు భర్గవ్ పంతులు, బబ్లు ,బొమ్మరాజు నరసింహ, పృథ్వీరాజ్ ,మధుసూదన్‌రెడ్డి , వెంకటరమణ, నాగభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే దోమల నివారణ



నీటి నిల్వలపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్ ప్రదీప్ కుమార్

మణికొండ: పరిసరాల్లో దోమల వ్యాప్తికి ఉన్న అవకాశాలను నిర్మూలించి వాటిని నివారించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మణికొండ మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన మున్సిపాలిటీ పరిధిలోని 5,6,18 వార్డుల్లో పర్యటించి దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కలిగించారు. ఇళ్లల్లో కుండీలు, టైర్లు, కూలర్లలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. వారంలో ఒక రోజు డ్రై డేగా పాటించాలన్నారు. అనంతరం ఆయన జయశంకర్‌పార్కు, చత్రపతి శివాజీ, ఎంజీ పార్కు, నేతాజీ పార్కులను సందర్శించి వాటి అభివృద్ధికి చేపట్టాల్సిన పనులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సానిటేషన్ ఇన్‌చార్జి సంపత్‌కుమార్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారం

మైలార్‌దేవ్‌పల్లి: మురుగు నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు మెట్రో వాటర్ అండ్ సివరేజీ బోర్డు డిప్యూటీ జీఎం రేణుక తెలిపారు. గత రెండు రోజులుగా పొంగిపొర్లుతున్న డ్రైనేజీ సమస్యను మైలార్‌దేవ్‌పల్లి సెక్షన్ మేనేజర్ సయ్యద్ సాజిద్ అలీ డీజీఎం దృష్టికి తీసుకెళ్లారు.దీంతో ఆమె శుక్రవారం కాలనీలోని ఆదిత్య ట్యాలెంట్ స్కూల్ ఎదుట పొంగి పొర్లుతున్న డ్రైనేజీ సమస్యను పరిశీలించారు. డీజీఎం ఆదేశాల మేరకు అధికారులు మ్యాన్ హోల్ మరమ్మతులు చేపట్టారు. డ్రైనేజీ సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ జీయాఉద్దీన్ , సూపర్‌వైజర్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.



వెంకటేశ్వర కాలనీలో సమస్యను పరిశీలిస్తున్న జలమండలి అధికారులు

ఘనంగా నల్లపోచమ్మ బోనాలు..



కూరగాయల మార్కెట్‌లో బోనాల సందడి

శంషాబాద్ : పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో శుక్రవారం నల్లపోచమ్మ బోనాలు ఘనంగా జరిగాయి. మార్కెట్ కమిటీ సభ్యులు, అడ్తిదారులు, వ్యాపారులు, చిరువ్యాపారులు కలిసి బోనమెత్తారు. ఈ సందర్భంగా పోతురాజుల విన్యాసాలు, ఘటాల ఊరేగింపులు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో జితేందర్, రాజేందర్, నరేష్, బన్ని, లింగం, వెంకటేష్, యాదగిరి, రాజేందర్, మోహన్‌రెడ్డి, రమేష్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడుల్లో ఆర్థిక వివేకం ఎంతో అవసరం

ఏఎంఎఫ్ఐ చీఫ్ ఎగ్జిక్యూటివ్ వెంకట్‌నాగేశ్వర్ చలసాని



వెంకట నాగేశ్వర్, సూర్యకాంత్‌శర్మకు మొమెంటో అందిస్తున్న ప్రొఫెసర్లు

రాయదుర్గం: పెట్టుబడి కోసం ఆర్థిక వివేకం ఎంతో అవసరమని అందరూ గుర్తించాలని అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఆఫ్ ఇండియా (ఏఎంఎఫ్ఐ) చీఫ్ ఎగ్జిక్యూటివ్ వెంకట్ నాగేశ్వర చలసాని పేర్కొన్నారు. హెచ్‌సీయూలో స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో ' ఇన్వెస్టర్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్ ఆన్ ఫైనాన్షియల్ విజ్‌డమ్' అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ పెట్టుబడుల ఎంపికలో పొదుపు, ప్రణాళిక, పెట్టుబడి పెట్టవలసిన అవసరాన్ని గుర్తించాలని సూచించారు. ఏఎంఎఫ్ఐ సీనియర్ కన్సల్టెంట్ సూర్యకాంత్‌శర్మ మాట్లాడుతూ విద్యార్థులు, పెట్టుబడిదారులు పెట్టుబడి పెట్టడానికి అవకాశం ఉంటే వదులుకోరాదన్నారు. వివిధ మ్యూచువల్ ఫండ్‌ల గురించి వివరించారు. పెట్టుబడి పెట్టడానికి మూడు అంశాలను దృష్టిలో పెట్టుకోవాలని ముఖ్యంగా పెట్టుబడి అవశ్యకత, పెట్టుబడి భద్రత, వ్యక్తుల లక్ష్యాల గురించి సమగ్రంగా వివరించారు. హెచ్‌సీయూ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ఇన్‌చార్జ్ ప్రొ.జీవీఆర్‌కే ఆచార్యులు, కార్యక్రమం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఐ.లోకానందరెడ్డి పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి సీఎస్ఆర్ నిధులు ఖర్చుచేయాలి

హెచ్ఐసీసీలో ఎక్సీడ్ గ్రీన్ ఫ్యూచర్ అవార్డుల కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మాదాపూర్: సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులను విద్య, వైద్యానికి ఖర్చుచేస్తే యువత సరైన మార్గంలో ముందుకెళుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో శుక్రవారం ఏక్ కామ్ దేశ్‌కే నామ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎక్సీడ్ గ్రీన్ ఫ్యూచర్ ఎన్విరాన్‌మెంట్ హెచ్ఆర్, సీఎస్ఆర్ అవార్డుల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ సంస్థలు సీఎస్ఆర్ కింద అందించే నిధులు అట్టడుగు వర్గాలకు, అవసరమైన పేదలకు చేరాలన్నారు. పది మందికి సాయం చేసే అవకాశం కేవలం సంస్థలకు మాత్రమే ఉందని చెప్పారు. వివిధ విభాగాల్లో యూనిట్లు, కంపెనీలకు సంబంధించిన విజేతలకు అవార్డులు అందజేశారు. సెల్కాన్ గ్రూప్ వ్యవస్థాపకుడు గురుస్వామినాయుడు, ఐబీసీఏ మాజీ డీజీ డాక్టర్ భాస్కర్ ఛటర్జీ తదితరులు పాల్గొన్నారు.

ఫలించిన చర్చలు

- ట్యాక్సీ డ్రైవర్ల ఆందోళన విరమణ
- ఇతర రాష్ట్రాల వాహనాల కట్టడికి చర్యలు
- పలు వాహనాలకు జరిమానా

శంషాబాద్: ఇతర రాష్ట్రాల క్యాబ్ సర్వీసులతో తమ ఉపాధికి గండి కొడుతున్నారని ఆరోపిస్తూ ఎయిర్‌పోర్టులో గత మూడు రోజులుగా ట్యాక్సీ డ్రైవర్లు ఆందోళన చేపట్టిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో శుక్రవారం పోలీసులు ట్యాక్సీ డ్రైవర్లతో చర్చలు జరిపారు. ఏసీపీ శ్రీనివాసరావుతో పాటు ఎయిర్‌పోర్టు అధికారులు, ఓలా, ఉబర్ సంస్థల అధికారులు చర్చల్లో పాల్గొన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ట్యాక్సీలు డ్రాపింగ్ అనంతరం స్థానికంగా వ్యాపారం చేసుకునేందుకు వీలు లేదని, వారిని కట్టడి చేసేందుకు చర్యలు తీసుకుంటామనా అధికారులు హామీ ఇవ్వడంతో ప్రస్తుతానికి ఆందోళన విరమిస్తున్నట్లు ట్యాక్సీ డ్రైవర్లు ప్రకటించారు.

ఆర్‌టీఏ స్పెషల్ డ్రైవ్

ఈ సందర్భంగా కొండాపూర్ ఆర్‌టీఏ ఎంవీఐ కృష్ణవేణి ఆధ్వర్యంలో ఇతర రాష్ట్రాలకు చెందిన మూడు వాహనాలు సీజ్ చేసిన అధికారులు మరో మూడు వాహనాలకు జరిమానా విధించారు. ఆందోళన చేపడుతున్న ట్యాక్సీ డ్రైవర్లు, మరెవరైనా ప్రయాణిస్తున్న వాహనాలను ఆపకూడదని ఆమె హెచ్చరించారు.



ఇతర రాష్ట్రాల వాహనాలను అడ్డుకుంటున్న ట్యాక్సీ డ్రైవర్లు



ఇతర రాష్ట్రాల వాహనాలకు జరిమానా విధిస్తున్న ఎంవీఐ కృష్ణవేణి

డ్రైవర్ల ఓవరాక్షన్..

ఓవైపు చర్చల కోసం వచ్చిన స్థానిక డ్రైవర్లలో కొందరు రోడ్డుపై గందరగోళం సృష్టించారు. ఏకంగా ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ ఎదుట కర్నాటక, మహారాష్ట్ర నంబర్ ప్లేట్ ఉన్న వాహనాలను అడ్డుకుని హల్ చల్ చేశారు. దీంతో పోలీస్‌స్టేషన్ ముందు ఉన్న రోడ్డుపై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. ట్రాఫిక్ పోలీసులు వారికి సర్దిచెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది.

రాజేంద్రనగర్ సబ్ రిజిస్టార్‌గా అమ్మిశెట్టి అరవింద్ బాబు



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సబ్ రిజిస్ట్రార్‌గా అమ్మిశెట్టి అరవింద్ బాబు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన సబ్ రిజిస్టర్‌గా పని చేసిన శృతి వల్లభనగర్ రిజిస్టర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన అమ్మిశెట్టి అరవింద్ బాబుకు డాక్యుమెంట్ రైటర్ క్రాంతి, అడ్వొకేట్, ఆఫీస్ ఆపరేటర్ సంపత్, కస్యం, మల్లేష్ గౌడ్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధి హామీ అక్రమాలపై విచారణ చేపట్టాలి

శంషాబాద్ రూరల్: ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పనుల్లో అవకతవకలు జరిగాయని చౌదరిగూడ మాజీ సర్పంచ్ రాజ్‌కుమార్ ఆరోపించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీలో మల్టీపుల్ వర్కర్‌గా పని చేస్తున్న వ్యక్తి భార్య పేరుతో ఉపాధి నిధులను కాజేశారని ఆరోపించారు. సదరు మహిళ ప్రైవేట్ ఆస్పత్రిలో ఉద్యోగం చేస్తుండగా.. గ్రామంలో మొక్కల సంరక్షణ కోసం వాచర్‌గా ఆమె పని చేస్తున్నట్లు కొంత కాలంగా ఉపాధి హామీ డబ్బులు డ్రా చేశారన్నారు. ఉపాధి హామీ నిధుల దుర్వినియోగంపై బహిరంగా విచారణ చేపట్టి డబ్బులు రికవరీ చేయడంతో పాటు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తాపీ మేస్త్రీ హత్య కేసులో నిందితుడి రిమాండ్

రాజేంద్రనగర్: తాపీ మేస్త్రీ రేణుబాబు హత్య కేసులో నిందితుడిని రాజేంద్రనగర్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. కిస్మత్‌పూర్ ప్రాంతానికి చెందిన వర్షిత్ (19) ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. తాపీ మేస్త్రీ రేణుబాబు వర్షిత్ తండ్రిని తరచూ వేధిస్తున్నాడు. దీంతో ఆగ్రహానికి లోనైన వర్షిత్ కాళీ మందిర్ వద్ద మద్యం మత్తులో ఉన్న రేణుబాబును బైక్‌పై ఎక్కించుకుని ఎక్సైజ్ పోలీసు అకాడమీ పక్కనే ఉన్న ఖాళీ స్థలంలోకి తీసుకెళ్లాడు. అనంతరం బండరాయితో అతడి తలపై మోది దారుణంగా హత్య చేసి అక్కడి నుంచి పరారయ్యాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు శుక్రవారం నిందితుడు వర్షిత్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

కులగణన ప్రాముఖ్యతను గుర్తించాలి

రాయదుర్గం: ఎప్పటిలాగానే మత రాజకీయాలతో గెలుస్తామని భావించిన బీజేపీకి ఈసారి ఎన్నికలు చెంపపెట్టు అని హెచ్‌సీయూ ప్రొఫెసర్ తన్వీర్ ఫజల్ అన్నారు. హెచ్‌సీయూలో ఎన్ఎస్‌యూఐ హెచ్‌సీయూ విభాగం ఆధ్వర్యంలో జనరల్ ఎలక్షన్స్-2024 : ఇంప్లికేషన్స్ ఫర్ ఇండియన్ డెమొక్రసీ' అనే అంశంపై ప్రత్యేక ప్యానల్ డిస్కషన్‌ను గురువారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు కులగణన ప్రాముఖ్యతను అందరూ గుర్తించాలన్నారు. హెచ్‌సీయూ పొలిటికల్ సైన్స్ ప్రొఫెసర్ కైలాష్ మాట్లాడుతూ కేంద్రంలో ప్రాంతీయ పార్టీలకు కూడా స్థానం లభించిందన్నారు. అనంతరం వ్యవసాయ చట్టాల అమలు రద్దుని ఆయన వివరించారు.

ఫ్రైడే ఫ్యూజన్ ఫీస్టా

చందానగర్: గచ్చిబౌలిలో నిర్వహించిన ఫ్రైడే ఫ్యూజన్ ఫీస్టా కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. శుక్రవారం గచ్చిబౌలిలోని ఎస్పీకే భవనంలోని వింధ్యావాణి కేఫ్‌లో ఏర్పాటు చేసిన ప్రదర్శనలో ఆహారం, ఆభరణాలు, దుస్తులు, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, గేమ్స్ స్టాళ్లు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రదర్శన అందుబాటులో ఉంది.

అక్రమ గ్యాస్ ఫిల్లింగ్ గోదాంపై దాడులు

117 అక్రమ సిలిండర్లు స్వాధీనం



ఫిల్లింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న పౌర సరఫరాల శాఖ అధికారిని బాల సరోజ

మైలార్‌దేవ్‌పల్లి: అక్రమంగా గ్యాస్ రీ ఫిల్లింగ్ చేస్తున్న గోదాంపై పౌరసరఫరాల శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. శుక్రవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని లక్ష్మిగూడ ప్రాంతంలో అక్రమంగా గ్యాస్ ఫిల్లింగ్ చేస్తున్నట్లు సమాచారం అందడంతో గోదాంపై దాడులు నిర్వహించిన అధికారులు 117 గ్యాస్ సిలిండర్లతో పాటు రీ ఫిల్లింగ్ చేసే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏఎస్ఓ బాలసరోజ మాట్లాడుతూ..గత కొన్నాళ్లుగా సర్జిత్ అనే వ్యక్తి డొమెస్టిక్ సిలిండర్లను కొనుగోలు చేసి వాటిని కమర్షియల్ సిలిండర్లలో గ్యాస్ ఫిల్లింగ్ చేస్తూ అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నాడన్నారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దాడుల్లో సీనియర్ ఇన్‌స్పెక్టర్ ముక్రం, జూనియన్ ఇన్‌స్పెక్టర్ మొయినుద్దీన్ పాల్గొన్నారు.

30 ఏళ్ల పోరాటం ఫలించింది



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పాత్రికేయులు

రాజేంద్రనగర్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు అనుకూలంగా దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మాదిగ, మాదిగ ఉప కులాల జర్నలిస్టులు శుక్రవారం రాజేంద్రనగర్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులు ఎ.భీమయ్య, పి.వెంకటేశ్ మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని గత 30 ఏళ్లుగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ నేతృత్వంలో ఎన్నో పోరాటాలు జరిగాయన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వర్గీకరణ చేపట్టి 59 ఉప కులాలకు మేలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు ఎం.బాలసుబ్రహ్మణ్యం, వెంకటేశ్, కె.నరసింహ, అంజిబాబు, యు.శ్రీకాంత్, రవి కుమార్, రాజు, రామకృష్ణ, ఎం.బాల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం



ముచ్చింతల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

శంషాబాద్ రూరల్: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంపై యువజన సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని ముచ్చింతల్‌లో కోర్టు తీర్పును స్వాగతిస్తూ అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. వర్గీకరణ సాధన ఉద్యమంలో అమరులకు ఈ విజయం అంకితమంటూ అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కె.ప్రశాంత్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెంటయ్య, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు సీహెచ్.నర్సింహ, సంఘం ఉపాధ్యక్షుడు యాదగిరి, సొసైటీ డైరెక్టర్ రాఘవేందర్, నాయకులు జనార్ధన్, సుభాష్, ప్రదీప్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

విజయనగర్‌కాలనీ: రక్తదానం ప్రాణదానంతో సమానమని జేఎన్ఏఎఫ్ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మధుకర్ అన్నారు. శుక్రవారం మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రాధిక ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటీవ్ మెడిసిన్ పబ్లిక్ హెల్త్ ల్యాబ్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ నారాయణగూడ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ మధుకర్ ప్రారంభించి మాట్లాడుతూ..ప్రమాదాలు జరిగినప్పుడు, శస్త్రచికిత్సల సమయంలో, కేన్సర్, తలసేమియా రోగులకు తరచూ రక్తం అవసరం ఉంటుందన్నారు. ఈ రక్తదాన శిబిరంలో కాలేజ్ ఆఫ్ ఫైనార్ట్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గంగాధర్, ప్రొఫెసర్ కమల్‌రాయ్, ప్రొఫెసర్ సీతారామలక్ష్మి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ మను, చిన్న సైదులు, ఎ.సత్యనారాయణ, సతీష్, ఆదిత్య మూర్తి, పాల్గొన్నారు.

మేరుత్సవ్- 2024

చందానగర్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మదీనాగూడ మేరు ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో మేరు ఇంటర్ స్కూల్ ఫెస్ట్ మేరుత్సవ్ 2024ను శుక్రవారం అట్టహాసంగా నిర్వహించారు. స్కూల్ వ్యవస్థాపకురాలు మేఘన హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత 5 సంవత్సరాలలో దక్షిణ భారత్‌లోనే ఇంటర్ స్కూల్ ఫెస్ట్‌లో ఒకటిగా నిలిచిందన్నారు. మేరుత్సవ్‌లో భాగంగా తెల్లాపూర్‌లోని మేరు ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు నిర్వహించిన కార్యక్రమానికి 40 స్కూళ్లకు చెందిన 2500 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు.



నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

బండ్లగూడ: హిమాయత్‌సాగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదర్షాకోట్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి 11.30 వరకు వెంకటేశ్వర కాలనీ, డైమండ్‌వ్యాలీ, ప్రశాంత్‌నగర్, తిరుమల గార్డెన్, రాధా రియల్ట్స్ ఫేస్-2, పవానీ హార్మోనీ విల్లాస్, బచ్‌పన్ స్కూల్, పార్ట్ ఆఫ్ పద్మశ్రీహిల్స్ మెయిన్ రోడ్, స్నేహిత హిల్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 11.30 నుంచి 12 గంటల వరకు స్నేహితహిల్స్ కాలనీ ఫేస్-1,2, మిల్రీ-2 ఫీడర్ పరిధిలో 12 గంటల నుంచి 12.30 వరకు మాపెల్ టైన్, విశ్వాస్ టౌన్, పిఅండ్‌టి కాలనీ ఫీడర్ పరిధిలో 12.30 నుంచి ఒంటి గంట వరకు పిఅండ్‌టి కాలనీ, ఏ,బి,సి,డి, స్పెషల్ బ్లాక్, సన్‌సిటీ, కీర్తి రిచ్‌మండ్ విల్లాస్, కాళీమందిర్ ఫీడర్ పరిధిలో 1 గంట నుంచి 2 గంటల వరకు బైరాగిగూడ, శివపురి, శివసాయినగర్ ఫేస్-1,2, సుబ్రహ్మణ్య కాలనీ, వాల్మీకి నగర్, సంఘంసిటీ, గంధంగూడ, ఇండస్ విల్లాస్, సాయిబాలాజీ నగర్, సంజయ్‌గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

మైలార్‌దేవ్‌పల్లి పరిధిలో..

మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ సబ్‌స్టేషన్ అసిస్టెంట్ ఇంజినీర్ ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 11 గంటల నుండి 11.30 గంటల వరకు క్రిస్టల్ టౌన్ ,మిలాత్‌నగర్ , జహంగీరాబాద్ ,వాడిఈపారా ప్రాంతాల్లో, 11.30నుండి 12 గంటల వరకు వినాయక్‌నగర్ ,అలీనగర్ ,అయేషాకాలనీ,అహ్మద్‌నగర్ ,ప్యాలెస్ వ్యూ,కింగ్స్ అవెన్యూ ,12 గంటల నుంచి 12.30గంటల వరకు రాజీవ్‌గాంధీ నగర్ ,పటేల్ నగర్ ,హరిజన బస్తీ, రహమత్‌నగర్ ,బండ్లగూడ విలేజ్ ,అబ్దుల్లా కాలనీ, క్రిస్టల్ టౌన్ , తులసినగర్ , సుభాన్ హిల్స్ ,ఆషామాబాద్ ,18,19 వ వార్డు, దస్తగిరి నగర్ లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

రేపు చిత్రపురి సొసైటీ సమావేశం

మణికొండ: చిత్రపురి హౌసింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం ఆదివారం ఉదయం సొసైటీ కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు సొసైటీ ప్రధాన కార్యదర్శి పీఎస్ఎన్ దొర తెలిపారు. సభ్యులు తప్పనిసరిగా హాజరై తమ అభిప్రాయాలను వెల్లడించడంతో పాటు పాలకకమిటీ సూచనలను తెలుసుకోవాలన్నారు. ఇటీవల చోటు చేసుకున్న పోలీసు కేసులు, కోర్టు కేసులు, అరెస్టులు తదితర అంశాల తర్వాత నిర్వహిస్తున్న సర్వసభ్య సమావేశం హాట్‌హాట్ సాగే అవకాశం ఉన్నట్టు సభ్యులు పేర్కొంటున్నారు. సమస్యలపై గళం ఎత్తేందుకు సభ్యులు సిద్ధమవుతుండగా, తాము సొసైటీ అభివృద్ధికి చేసిన పనులను చెప్పి సభ్యులను మెప్పించేందుకు పాలకకమిటీ ప్రయత్నిస్తోంది. ఎక్కువ మంది సభ్యులు పాలక కమిటీకి వ్యతిరేకంగా గళమెత్తితే పాలకకమిటీని రద్దు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు సమాచారం.

పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్: అనారోగ్యంతో ఆస్పత్రుల్లో చేరిన పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ అండగా నిలుస్తోందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని కొత్వాల్‌గూడకు చెందిన జనని అనే మహిళ ఇటీవల నిమ్స్‌లో చికిత్స పొందింది. సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఆమెకు మంజూరైన రూ. లక్ష చెక్కును ఎమ్మెల్యే శుక్రవారం బాధితురాలికి అందజేశారు. కార్యక్రమంలో కొత్వాల్‌గూడ మాజీ సర్పంచ్ పి. శ్రీనివాస్‌గౌడ్, ఎస్. కృష్ణముదిరాజ్, సిద్దేశ్వర్‌గౌడ్, బాలయ్య, అశోక్ ముదిరాజ్, అంజి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్త పనులతో అవస్థలు




రోడ్డుపై పారుతున్న మురుగునీరు

అత్తాపూర్: రోడ్డు నిర్మాణ పనుల్లో ప్రణాళిక లోపించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్తాపూర్ జనప్రియ చౌరస్తా నుంచి లంగర్‌హౌస్ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై తరచూ తవ్వకాల కారణంగా స్థానికులు ఇబ్బందిపడుతున్నారు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి వ్యవస్థను ఆధునికీకరణ పేరుతో ఎవరికివారు రోడ్డును తవ్వేస్తున్నారు. దీంతో లక్షలు వెచ్చించి నిర్మించిన రోడ్లు ఛిద్రమైపోతున్నాయి. అంతర్గత డ్రైనేజీ వ్యవస్థతో పాటు మంచినీటి పైపులైన్ల నిర్మాణాలు పూర్తి చేసిన తర్వాతే రోడ్డు పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

భార్యపై దాడి చేసిన వ్యక్తికి జైలు, జరిమానా

గౌలిపురా: భార్యపై దాడికి పాల్పడిన కేసులో ఓ వ్యక్తికి శుక్రవారం నాంపల్లిలోని కోర్టులో హాజరుపరచగా 4వ స్పెషల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ డి.సి.ఉమాపతి రావు నెల రోజుల జైలు శిక్షతో పాటు రూ.50 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. బార్కాస్ బిస్మిల్లా కాలనీ ప్రాంతానికి చెందిన షేక్ షబ్బీర్ (32) ఇటీవల తనపై తీవ్రంగా కొట్టి దాడి చేశాడు. దీనిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు భవానీనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని నిందితున్ని శుక్రవారం నాంపల్లిలోని కోర్టులో హాజరు పరచగా పూర్వ పరాలను పరిశీలించిన 4వ స్పెషల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ డి.సి.ఉమాపతి రావు నెల రోజుల జైలు శిక్షతో పాటు రూ.50 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

హెచ్‌సీయూను సందర్శించిన రవిప్రభు



రాయదుర్గం: ప్రపంచంలో అత్యధిక దేశాలు పర్యటించిన వ్యక్తులలో ఒకరిగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థి రవిప్రభు గుర్తింపు పొందారు. శుక్రవారం ఆయన హెచ్‌సీయూకు వచ్చారు. పొలిటికల్ సైన్స్ విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానమిచ్చారు. తన పర్యటన అనుభూతి, వివిధ అంశాలను విద్యార్థులతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీయూ పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ కెకె కైలాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అధ్యాపకులు డాక్టర్ ఎస్ షాజీ, పీఆర్ఓ ఆశిష్‌జాకబ్ థామస్ ప్రసంగించారు.